# గుండె గుండెలో...

కేదారి అడుగులు తడబడుతున్నాయి. పావో, ప్యాకెట్టో పుచ్చుకున్న ఫలితం కాదు.

ఆ పావును, ప్యాకెట్‌ను అందించే పాపమ్మ కళ్లలో మెదిలి... అడుగులు తడబడి నాలుక తడి ఆరి... కేదారి మెలికలు తిరిగి పోతున్నాడు.

పాపమ్మ కళ్లలో కల్లు కుండల పొంగులు, పాపమ్మ గొంతులో తీపి తీపి చక్కెర బిళ్లలు కేదారిని ఉక్కిరి బిక్కిరి చేస్తాయి. పాపమ్మ మనసులో మెదిలితే చాలు కేదారి నడకే మారిపోతుంది. మారిపోతుంది.

పాపమ్మను ఆ ప్రాంతానికి పట్టుకొచ్చిన కాంతయ్య ఇంద్రుడంతటి జిత్తులమారి మేనకలాంటి పాపమ్మను ఎరవేసి విశ్వామిత్రుల్లాంటి కార్మికులను లొంగదీసుకుంటాడు. కాంతయ్య రాజకీయ నాయకులంతటి మాటకారి కూడా - పరాయి సొమ్ముల్ని కాజేయడంలో మంత్రుల కేం తీసిపోడు. ఆ పద్ధతులన్నీ బాగా తెలిసినవాడు! అందుకే పాపమ్మల్ని కార్మికులుండే ప్రాంతాల్లో బేపారం మిషతో దింపుతాడు. కార్మికుల నరాల్ని విషంతో నింపుతాడు.

కేదారి చేతికి స్వయంగా పాపమ్మే ప్యాకెట్ అంటిస్తుంది. సారా పావు అందిస్తుంది. నవ్వుతూ పలకరిస్తుంది. కాంతయ్య చేతిలో పదునైన ఆయుధంలా పనిచేస్తుంది. పాపమ్మ పరిచయం అయినప్పట్నించి కేదారికి సారా అలవాటు వ్యసనంగా మారింది.

ఎన్నో రోజుల్నుంచి పాపమ్మకు ఏదైనా కానుక ఇవ్వాలనుకుంటున్నాడు కేదారి. ఆ కానుక తీసుకొంటూ ఆమె నవ్వితే, మురిపెంగా చూస్తే... ఆ ఓర చూపుల్ని దోర నవ్వుల్ని దోచుకోవాలనుకుంటున్నాడు.

ఆ రోజూ బజారులో బీరపూల రంగు చీరను చూసి, మనసులోనే పాపమ్మకు ఆ చీరను చుట్టి పొంగిపోయాడు. 'పెద్ద విశ్వామిత్ర'లోని మేనకకైనా, 'చిన్నవిశ్వామిత్ర'లోని మేనకకైనా పాపమ్మ ముందు బలాదూర్ అనుకున్నాడు.

బేరమాడకుండా, ఆ రోజే చేతిలో పడిన జీతంలోంచి ఆ బీరపూల చీరను కొన్నాడు. అది పాపమ్మకే అనుకొని నడుస్తుంటే కేదారి అడుగులు తడబడతున్నాయి. గుండెలో జలపాతాలు దూకుతున్నాయి. వొంకర వొంకర పాటలు వినబడుతున్నాయి. మొగిలి పూలవాసనలు ముక్కుపుటల్ని ఎగరగొడుతున్నాయి.

అప్పటికే మొగులు కమ్ముకుంది.

కేదారి నడక వేగాన్నిపెంచాడు. రాత్రి తొమ్మిది కాబోతుంది. సన్నగాజల్లు పడుతోంది. చూస్తుండగానే కుండపోతగా వర్షం కురవసాగింది.

కేదారి కంగారుపడ్డాడు. కవరులోవున్న బీరపూల చీర తడిసి పోతుందేమోనని కలత చెందాడు. అంగీమాటున ఆ కవరు దాచి వర్షం వెలిసేదాకా ఓ చూరు క్రింద నుంచున్నాడు.

తాను ఆ కానుక ఇస్తున్నప్పటి పాపమ్మ మత్తు కళ్లని. బొడ్డుమల్లె నవ్వుల్ని, మరోసారి వూహించుకొని వూగిపోతున్నాడు. కేదారి...!

దాదాపు పావు జీతాన్ని ఆ చీర కాజేస్తేనేం ఈ నెలలో వారం రోజులైనా తన భార్యా పిల్లలు పస్తులుంటేనేం...

కేదారి నిషాలో వున్నాడు. బంధాలు, బాధ్యతలు, తాకని ఇనుప పంజరంలో ఇరుక్కున్నాడు!

కార్మిక నాయకుడు పరమేశం అప్పుడప్పుడు హెచ్చరిస్తూనే వున్నాడు. పాపమ్మలాంటి పావులు, పాముల పట్ల కార్మికులు జాగ్రత్తగా వుండాలని...! కాని పరిస్థితి హెచ్చరికల్ని వినేదశలో లేదు. చాలా ముదిరిపోయింది.

కేదారిలాంటి కార్మికులు దిగుడుబావి ఆఖరి మెట్టుమీదున్నారు. సంసారాల్ని గుల్ల చేసుకునే ప్రమాద పరిస్థితికి అతి చేరువలో వున్నారు.

ఇంకా జల్లు పడుతోంది...

బీడీ ముట్టించాడు కేదారి. గట్టిగా ఓ దమ్ము లాగి ముక్కులోంచి పొగను వొదిలాడు. వెచ్చగా హాయిగా వుంది. తునికాకు, పొగాకుల సమ్మేళనం... ఆ బీడీ భలే ఘాటుగా

వుంది. కైపుగా వుంది. ఆ మార్కు బీడీలంటే కేదారికి ఇష్టం. పాపమ్మ కూడా బీడీలు తాగుతుంది. ఆ మార్కు బీడీలే...! అందుకే ఆ మార్కు బీడీలంటే కేదారికి మరీమరీ ఇష్టం!

బీడీ మరోసారి దమ్ములాగాడు గుండెనిండా వెచ్చదనం...?

చేయి చాపి చూశాడు. వాన కొంచెం తెరిపినిచ్చింది. జనం పలుచగా కదులుతున్నారు. చూరుకింది నుంచి బయటకు వచ్చి వేగంగా అడుగులు వేస్తున్నాడు కేదారి. అప్పటికే కొంచెం తడిసివున్నాడు. పాపమ్మ గుడిసెకు పోదాం అనుకున్నవాడు రూటు మార్చుకొని తన గుడిసెకు బయలుదేరాడు పొడి దుస్తులేసుకొని ముస్తాబై పోవచ్చుననుకొని...!

కవరులోని బీరపూల చీరచూసి భార్య తనకే అనుకొని మురిసిపోతే?.... అదెందుకు అడుగుతుంది.తన ముందు నోరెత్తుతుందా?... ఎత్తితే బొక్కలిర్గతన్నడూ!

వడివడిగా నడుస్తున్నాడు కేదారి. అతని కళ్లలో పాపమ్మ కూర్చొనివుంది. అతని కాళ్లలో పాపమ్మ ఆవేశించి వుంది.

వడివడిగా నడుస్తున్నాడు కేదారి.

ఒక్క సూర్యుడు చాటైతే ఎంత చీకటి!

ఊరంతా చీకటి గుప్పిటిలో చిక్కుకుంది. కుక్కలు బేలగా అరుస్తున్నాయి. ఆకాశంలో చుక్కలు నీరసంగా వెలుగుతూ మలుగుతున్నాయి...!

గుడిసె చేరుకున్నాడు కేదారి.

పెళ్లయిన కొత్తలో సిగ్గుగా - " ష్... యా కొంతా" అని గుమ్మం ముందు నుంచోని గుసగుసగా పిలిచేవాడు.

ఒక బిడ్డ తండ్రి అయిన తరువాత ప్రేమగా "యాకాంతా..." అని పిలిచేవాడు.

ముగ్గురు బిడ్డల తండ్రయి...మేనక పాపమ్మ పరిచయమైన తరువాత భార్యను పేరుపెట్టి పిలవడం మానేశాడు కేదారి. ఆ మరులూ లేవు, మరులుగొలిపే పిలుపులూ లేవు!!

దబదబా తలుపు మీద బాదుతాడు.

"ఉన్నవా లేవేఇంట్లో..." అని విసుగ్గా పిలుస్తాడు.

ఆ రోజు విసుగ్గా పిలిచే అవసరం కలగలేదు కేదారికి.

గుడిసె తలుపు వోరగా వేసివుంది.

తలుపు తీసుకొని లోనికి వెళ్లాడు.

గుండెల మీద పవిటలేని యాకాంత గుర్రు పెట్టి నిద్రపోతోంది.

కేదారికి ఒళ్లు మండింది.

తలుపు గడియ పెట్టుకోకుండా మొద్దు నిద్రపోతున్నదా!...ఈ చెంపా ఆ చెంపా వాయించాలని ఆగ్రహంతో దగ్గరగా వెళ్లాడు.

వాడిపోయిన ఆమె చెక్కిళ్లను చూసి ఎత్తిన ఆ చేయి అలాగే ఆగిపోయింది.

ఒకప్పటి యాకాంత రూపం గుర్తుకొచ్చింది. బూరెల్లాంటి ఆమె బుగ్గలు గుర్తుకొచ్చాయి... ఒంటి బిగువులూ గుర్తుకొచ్చాయి.

ముగ్గురు బిడ్డల తల్లికాగానే అంతటి ముసలి తనం వొస్తుందా!!...లోతుకుపోయిన కళ్లు... గుడ్డి వెలుతురులో మరింత లోతుగా కనిపిస్తున్నాయి. దవడలకు అంటుకపోయిన చెంపలు...నల్లబడిన మొహం... వాడి వత్తలయిన గుండెలు! ఓ రొమ్ము ఇంకా చంటిదాని నోట్లోనే వుంది. చిరుగుల రవిక... ఎండుకపోయిన డొక్క... చింపుల చీర!...

కేదారి గుండె కలుక్కుమంది.

యాకాంత ఇలా కావడానికి కారణం నువ్వేకదూ?... నీ తాగుడే కదూ?? ఏనాడైనా నీ ఇంటిని పట్టించుకున్నావా?... ఇల్లాలిని పట్టించుకున్నావా?... పిల్లల అవసరాల్ని పట్టించుకున్నావా?

గుండె నిలదీసి అడిగింది.

ఒక్కసారి తల విదిలించాడు కేదారి...

భార్య వంక మరోసారి చూశాడు.

చలికి వొణుకుతూ పడుకున్నా చంటిదానికి తన చిరుగుల పవిట తీసి కప్పింది.

ఆ దృశ్యం చూసి అతని గుండె ద్రవించింది.

అతని కళ్ళు చెమ్మగిల్లాయి.

పశ్చాత్తాపంతో భార్య వంక చూశాడు. అప్పటిదాకా తన కోసం ఎదురు చూసి చూసి నిద్రబోయినట్లుంది.

వెచ్చగా పిల్లలకు కప్పడానికి ఒక్క మంచి చెద్దరు లేదు...! ఉన్న రెండు చింకి దుప్పట్లను కుట్టి చాప మీద పరచి ఇద్దరు పిల్లల్ని పడుకోబెట్టింది. తాను నేల మీద

పడుకొని చంటిదానికి పవిటకొంగు కప్పింది.

ఏనాడు కొన్న చీరో అది.

ఎన్ని మాసికలు పడింది!!

భార్య నోరు విడిచి ఏనాడూ తనకు ఇది కావాలని అడుగలేదు.

మాట వరసకైనా నీ జీతం ఎంతా అని అడగలేదు.

గోమాతల్ని ఇంట్లో వుంచుకొని గోపూజలంటూ పశువుల్ని పూజిస్తున్నాం!!

"యాకాంతా..."

ఎక్కడో అవలి ఒడ్డు నుంచి పిలిచినట్లు వినిపించింది. ఆ పిలుపు యాకాంతకు.

మెల్లగా కళ్లు తెరిచి చూసింది.

ఎదురుగా భర్త!

ఉలిక్కిపడి లేచి కూర్చుంది.

"యాకాంతా..."

ఆమె దగ్గరకు వెళ్లి అనునయంగా తల నిమిరాడు కేదారి.

నిద్ర పూర్తిగా వొదిలి భయపడింది. సిగ్గుపడింది యాకాంత!

"ఇంగో నీకేం తెచ్చిన్నో సూడు..." అంగీచాటు నుంచి కవరు తీసి అందించాడు.

విప్పి చూసింది.

చీర...!! ఆమె విస్మయానికి అంతులేదు.

"బాగుందా?..." అని అడిగాడు కేదారి.

ఆమె కళ్లే చెబుతున్నాయి.

ఎంత బాగుందో...!

ఆ చీరకంటే ఆ క్షణం ఆమెకు ఇంకా బాగుంది.

"కట్టుకో..."

"ఇప్పుడా!!..."

ఆశ్చర్యంగా, మురిపెంగా చూసింది.

"ఆ... ఇప్పుడే... ఈ కొత్తచీరలో... నిన్ను కళ్లారా చూడనియ్యి..."

లాలనగా ఆమె కళ్లలోకి చూశాడు.

సిగ్గుతో లేచి నిల్చుంది.

గుండెల్ని అరచేతుల్తో కప్పుకొని లంగా, రవికె మీద గుడిసె మూలకు వెళ్లింది. కుంకుమ అంటించి భర్త కోరిక మేరకు ఆ కొత్త చీర కట్టుకుంది.

భర్త కాళ్లకు దణ్ణం పెట్టబోయింది.

ఆ చేతుల్ని ఆప్యాయంగా అందుకున్నాడు. కేదారి తన గుండెకు ఆనించుకున్నాడు.

జేబులోని పోల్తిన్ కాగితం పొట్లం తీసి మిగిలిన జీతం డబ్బులు ఆమె చేతికి ఇచ్చాడు.

భార్య కళ్లలో వుబికిన బాష్పాల్ని తుడిచి అక్కున చేర్చుకున్నాడు.

ఆ క్షణంలో గుడిసె వెన్నెల్ని మించిన వెలుగులతో నిండిపోయింది.

*విపుల మాసపత్రిక, అక్టోబర్, 1991*